క్లుప్తంగా

పాడి రైతులకు రాయితీతో గడ్డి విత్తనాలు

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు రాయితీతో గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు పశు వైద్యాధికారి రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 కిలోల గడ్డి విత్తనాల బ్యాగ్ ప్రభుత్వ రాయితీ పోను రూ.120కి పంపిణీ చేస్తామన్నారు. పాడి రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని ఆయన కోరారు.

ఆర్టీపీపీ ప్రాజెక్టు ఆసుపత్రికి చేరిన మందులు



ఆర్టీపీపీ ప్రాజెక్టు ఆసుపత్రికి చేరిన మందులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఉన్న ప్రాజెక్టు ఆసుపత్రికి ఎట్టకేలకు మందులు చేరాయి. ఈ నెల 12వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనంకు ఆర్టీపీపీ ప్రాజెక్టు ఆసుపత్రిలో మందుల కొరత అనే కథనంకు స్పందించారు. ఆర్టీపీపీలోని ప్రాజెక్టు ఆసుపత్రిని భవ్య సంస్థకు ఏపీజెన్‌కో యజమాన్యం అప్పగించిన విషయం తెలిసిందే. మొదట్లో మందుల కొరత ఉండేది. ఎట్టకేలకు భవ్య సంస్థ వారు ప్రాజెక్టు ఆసుపత్రికి మందులు సరఫరా చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో సరిపడ మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు.

రేషన్ కార్డులు పంపిణీ

ఎర్రగుంట్ల : కార్డుదారులకు ప్రభుత్వం జారీ చేసిన కొత్తరేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. మండలానికి 20,823 కొత్త రేషన్ కార్డులు వచ్చాయన్నారు. పాత రేషన్ కార్డులు ఉన్నవారికి వాటి స్థానంలో కొత్త కార్డులు వచ్చాయన్నారు. సచివాలయ ఉద్యోగులకు కొత్త కార్డులు అందిజేశామన్నారు. సచివాలయ ఉద్యోగులు కార్డుదారులకు అందజేస్తారన్నారు.

వైద్య పరీక్షలు



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లింగాల : మండలంలోని కోమన్నూతల హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ గౌతమిలు బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అలాగే 60 ఏళ్లు నిండిన వారికి ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డ్స్ కోసం జనరేట్ చేయడం, 70 ఏళ్లు నిండిన వారికి ప్రధాన మంత్రి జన ఆరోగ్య వేయ్ వందనం పథకానికి ఈకేవైసీ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది..



రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి

ఎర్రగుంట్ల : కలమల్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిణి సుజనకుమారీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి హాజరై రైతులకు పంట సాగులో వచ్చే దిగుబడుల నష్టాలపైన, తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న జేసీబీ

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తసంగటిపల్లె గ్రామ పంచాయతీలోని చింతవాండ్లపల్లె పొలాల్లోకి వెళ్లె దారిలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైయింది. సర్పంచ్ అంజలి ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వరిలో లైన్ సోయింగ్ పాటించాలి

మైదుకూరు : వరి పంటలో లైన్‌సోయింగ్ పద్ధతి పాటించడం మేలని మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని అన్నలూరు, సోమయాజులపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ లైన్ సోయింగ్ పద్ధతి వల్ల వరి పంటకు గాలి వెలుతురు బాగా సోకుతుందని, చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు.

వివిధ అలంకారాలలో వాసవీమాత



పులివెందుల : శ్రీమీనాక్షిదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి



కమలాపురం : మధుర మీనాక్షిదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీ దేవి



వేముల : ప్రత్యేక అలంకరణలో నల్లనమ్మ అమ్మవారు



కమలాపురం : ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళా మండలి సభ్యులు

పులివెందుల టౌన్ : దేవీ శరన్నరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం పట్టణంలోని అమ్మవారిశాలలోని శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీమీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో శ్రీగజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామలింగ చౌడేశ్వరిదేవీ ఆలయంలో శ్రీదీక్షాబంధని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవేంకటరమణుడి ఆలయంలో వేంకటరమణుడు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ అలంకారాలలో ఉన్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం ఆలయాల అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



జమ్మలమడుగు : కన్యతీర్థంలో శ్రీకాత్యాయనీదేవి అలంకరణలో శ్రీ బాలత్రిపురసుందరి దేవి

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారు మధుర మీనాక్షిదేవి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. జూటూరు వీరరామయ్య కుటుంబ సభ్యులు అలంకారానికి దాతలుగా వ్యవహరించారు. కామిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీరె సమర్పించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

వేములలో..

వేముల : మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీనల్లనమ్మ ఆలయంలో మగళవారం ఆలయంలో కలశ స్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణ, దీక్షా హోమాలు నిర్వహించారు. మహిళా భక్తులచే కోటి కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పురోహితులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, చిలంకూరు, ఆర్టీపీపీలలో అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమించారు. పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శ్రీ భవానీదేవి అలంకరణలో, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో, ఆర్టీపీపీలోని శ్రీచౌడేశ్వరిదేవి అలంకరణలో భవానీదేవి అలంకరణలో, అంకమ్మ తల్లి దేవాలయంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమించారు.



ఎర్రగుంట్ల : అంకమ్మతల్లి దేవాలయంలో గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు



పులివెందుల : శ్రీదీక్షాబంధని అలంకారంలో రామలింగ చౌడేశ్వరి అమ్మవారు

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కన్యతీర్థంలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు హరిహరనాథ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : అనిమెల సంగమేశ్వరస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో బాగంగా రెండవ రోజు తలపనూరు గంగమ్మతల్లి, సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా, కీర్తిపల్లె నల్లనమ్మ తల్లి, గడ్డంవారిపల్లెలోని రాజరజేశ్వరీదేవి, అనిమెల బోగాదమ్మతల్లి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వల్లూరు

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్య వైశ్య కళ్యాణ భవనంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో కామాక్షిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినమిచ్చారు. ముందుగా అమ్మవారికి ఆలయ ఈఓ కృష్ణానాయక్, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



పులివెందుల : శ్రీగజలక్ష్మీదేవి అలంకారంలో అంకాలమ్మ అమ్మవారు



వల్లూరు : శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు



ఎర్రగుంట్లలోని శ్రీ ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణ అమ్మవారు



వీఎన్‌పల్లె : గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అనిమెల బోగాదమ్మతల్లి



పెండ్లిమర్రి : పొలతలలో కామాక్షిదేవి అలంకరణలో అమ్మవారు



సింహాద్రిపురం : శ్రీగాయత్రిదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి అమ్మవారు



కొండాపురం : దత్తాపురంలో గాయత్రిదేవి అలంకరణలో అమ్మవారు

ఆర్టీపీపీలో రెండో రోజుకు చేరిన దీక్షలు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి భూములు కోల్పోయిన వారిని పర్మినెంట్ చేయాలని, అలాగే కాంట్రాక్ట్ కార్మికులను తెలంగాణ రాష్ట్రం తరహాలో సంస్థలో విలీనం చేయాలని టీఎన్‌పీకేఎస్ బీఎంఎస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారానికి రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షలలో పి.సూరిబాబు, వై.హరిచంద్రారెడ్డి, ఎం.రామాంజనేయరెడ్డి, షేక్ షబ్బీర్, కె.వెంకటశివుడులు శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల 2022 పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, కార్మికులను సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఓసీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



దీక్షలు చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

రహదారి.. కంపచెట్ల మయం

ముద్దనూరు : ముద్దనూరు–కడప ప్రధాన రహదారి నుంచి స్థానిక రైల్వేస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళే రహదారి మొత్తం కంపచెట్ల మయంగా మారింది. సుమారు 1కి.మీ.పొడవుతో నిర్మించిన సిమెంటు రోడ్డుకు ఇరువైపులా, డివైడర్‌లో పూర్తిగా కంపచెట్లు పెరిగాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి ఇబ్బందికరంగా మారింది. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోకి వెళ్లే అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా దట్టంగా కంపచెట్లు పెరగడంతో అసౌకర్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మండలంలోని ప్రభుత్వ అధికారులు ప్రయాణించే ఈ మార్గం కంపచెట్లతో అలుముకుంటున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయమని ప్రజలు అభిప్రాయం వ్యకం చేస్తున్నారు.



రహదారి వెంబడి పెరిగిన కంపచెట్లు

ఆకాశంలో హరివిల్లు

సూర్యోదయం, సూర్యాస్తమయం రెండు అద్భుతమే. సూర్యోదయ సమయంలో ఆకాశంలో హరివిల్లు ఆవిష్కృతమైతే.. ఆ దృశ్యాలను వర్ణించలేము. మంగళవారం అట్లూరులో తూర్పున సూర్యోదయం వేళ చిరుజల్లులతో ఆకాశం మేఘావృతమై ఉండగా.. పడమట కొడవైపు పచ్చని చెట్లపై ఆకాశంలో ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. తన సొగసు చూడ తరమా అన్నట్టు సుమారు గంటపాటు చూపరులను అలరించి ఆకట్టుకుంది. ప్రకృతి సౌందర్యాన్ని చూసి పలువురు ముగ్ధులయ్యారు. ఇంద్రధనుస్సు అందాలను తమ సెల్ఫీల్లో బంధించారు.

–అట్లూరు



వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న 'కూటమి'

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులపై పైసా భారం లేకుండా అండగా నిలిచిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించి రైతులను నట్టేట ముంచిందని అన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో రైతులకు చేదోడువాదోడుగా ఉన్న రైతుభరోసా కేంద్రాలతో పాటు సచివాలయాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూస్తే రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఉద్దేశం కనిపిస్తోందని ఆరోపించారు. అలాగే గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సోమశిల లిఫ్టిఇరిగేషన్ ద్వారా బద్వేలు ప్రాంతానికి ఒక టీఎంసీ నీరు అందించే విధంగా జీవో ఇచ్చారని, ఆ జీవోను తక్షణమే అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. తక్షణమే రైతులను ఆదుకుని రైతు ఆత్మహత్యలను నివారించాలని కోరారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, బాబు, జయరామరాజు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఐక్యతే మహాబలం

మైలవరం (పెద్దముడియం) : రైతులు కలసి ఉండి పోరాటాలు చేస్తేనే ప్రభుత్వాలు దిగి వస్తాయని ఐకమత్యమే మహాబలం అని భారతీయ కిసాన్ సంఘ్ దక్షిణాది రాష్ట్రాల నాయకుడు దోనూరు రాము, రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డిలు తెలిపారు. మంగళవారం పెద్దముడియం మండలంలోని పెద్దపసుపులలో గ్రామ కమిటీ సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కళ్ల ముందే సమస్యలు ఉన్నా రైతుల్లో సంఘ్యత లేకపోవడం వల్ల భారీగా నష్టపోతున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలను మెడ వంచాలన్న వారితో పనులు చేయించుకోవాలన్నా అందరు కలసిరావాలన్నారు. అనంతరం నెమళ్ల దిన్నె, బలపనగూడురు, గరిశలూరు, చిన్నముడియం, ఉప్పలూరు గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించాలని జాతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గానికి విన్నవించారు. త్వరలోనే రైతుల కోసం పోరాటానికి సిద్ధం అవుతామని రైతులు కలసి రావాలని రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.సుబ్బారెడ్డి, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్రెడి చంద్రశేఖర్‌రెడ్డి, మండల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి

కిరీటం బహూకరణ

సింహాద్రిపురం : స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు మంగళవారం ఎరువుల అంగడి యజమాని సోమల చంద్రశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు ఇత్తడి రతనాల కిరీటం బహూకరించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ స్వామివారికి అర్చన అనంతరం శ్రీవారికి ఇత్తడి రతనాల కిరీటాన్ని అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, చంద్రశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి ఇత్తడి రతనాల కిరీటాన్ని అందించిన చంద్రశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు